www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ఆనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ లో.. శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి



**అనంతపురం,మార్చి23.అక్షర టైమ్స్:** శ్రీ చైతన్య విద్యా సంస్థలకు సంబంధించి డాక్టర్ బిఎస్ రావు మెమోరియల్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ విజయవాడలోని గోశాలలో మార్చి22, 23వ తేదీలలో ఘనంగా జరిగిందని, ఇందులో అనంతపురం జోనుకు చెందినటువంటి విద్యార్థులు కోకో సీనియర్ బాలుర విభాగంలో ట్రోఫీని కైవసం చేసుకున్నారని, అనంతపురం జోన్ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందినటువంటి విద్యార్థులు జోనల్ లెవెల్ లో గెలుపొంది, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని, ఈ రాష్ట్రస్థాయి పోటీలలో మన ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి శ్రీ చైతన్య పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు సీనియర్ కోకో విభాగంలో ట్రోఫీని కైవసం చేసుకున్నారని, అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 23 టీములు ఈ పోటీలలో పాల్గొనగా అనంతపురం జిల్లాకు చెందిన బాలురు విజయ కేతనం ఎగురవేసి ట్రోఫీని అందుకున్నారని ఈ టీంలో నుంచి ముగ్గురు బాలురు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం గర్వించదగ్గ విషయమని అన్నారు. అంతేకాకుండా త్రో బాల్ సీనియర్ బాలికల విభాగంలో ముగ్గురు బాలికలు, కోకో సీనియర్ బాలికల విభాగంలో ఇద్దరు బాలికలు జాతీయస్థాయికి ఎంపిక అవడం ఆనందంగా ఉందని అన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలు చదువుతోపాటు ఆటలలో కూడా పిల్లలకు సమానంగా శిక్షణ ఇవ్వడం వలన ఇంతటి ఘన విజయం సాధ్యమైందని, ఇందుకు సహకరించిన పీఈటీలకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయం అందించిన ఉత్సాహంతో భవిష్యత్తులో జాతీయస్థాయిలో కూడా మన ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందినటువంటి విద్యార్థులు విజయకేతనం ఎగిరివేయాలని తద్వారా జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో ఉన్నత స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ప్రిన్సిపల్స్, డీన్స్, కోఆర్డినేటర్లు, పిఈటిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నైతిక విలువలకు నిలువుటద్దం ఉన్నం

**- మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ**





**కళ్యాణదుర్గం,మార్చి23.అక్షర టైమ్స్:** ఈరోజులలో రాజకీయాల్లో నైతిక విలువలు పడిపోతున్న సందర్భంలో వచ్చే తరానికి ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపి చూపించిన మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి సేవలు గుర్తుండిపోతాయని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈరోజు కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి గ్రామంలో దివంగత నేత మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దాయన భార్య లక్ష్మీదేవి కుమారులు మారుతి చౌదరి, ఉదయ భాస్కర్ చౌదరి, పెద్ద కుమారుడు వీరేశ్ ఇతర కుటుంబ సభ్యులను కలసి ధైర్యాన్ని నింపారు. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున సంపూర్ణ సంతాపం తెలుపుతున్నామన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రజలతో మమేకపై పనిచేసి గుర్తింపు తెచ్చుకున్న పెద్దాయన తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో నాతో పాటు అనేక పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. నైతిక విలువలకు కట్టుబడి విలువలతో చివరి వరకు జీవించిన హనుమంతరాయ చౌదరి వచ్చేతరానికి ఆదర్శప్రాయమైన రాజకీయం చేశారని అన్నారు. రైతు మనస్తత్వంతో ముందుకు సాగారని పదేళ్లపాటు టిడిపి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పెద్దాయనను చంద్రబాబు గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించారని చెప్పారు. పెద్దాయన చేసిన సేవలను గుర్తుగా ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమానికి ఆయన పేరును ప్రతిపాదించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబును తాను కలిసినప్పుడు ఇదే విషయాన్ని గుర్తు చేస్తానన్నారు. ఈ ప్రాంతంలో అందరివాడిగా బతికిన హనుమంతరాయ చౌదరి జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ , సహాయ కార్యదర్శి నరసింహులు, నారాయణస్వామి, సెట్టూరు మండల కార్యదర్శి తిమ్మరాయుడు, కళ్యాణదుర్గం మండల కార్యదర్శి ఆంజనేయులు సహాయ కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, మాజీ జెడ్పిటిసి సభ్యులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయిళ్ళు అరెస్ట్ నగదు స్వాదనం : కుందిర్పి ఎస్ఐ జి.మహేష్




**కళ్యాణదుర్గం,మార్చి23.అక్షర టైమ్స్:** కుందుర్పి ఎస్ఐ జి.మహేష్ తన సిబ్బందికీ వచ్చిన సమాచారం మేరకు ఎనుములదొడ్డి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న వారి పై సిబ్బంది సహాయంతో రైడ్ చేసి 5 మంది వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ. 19450/- నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడమైనది.

# కేంద్ర ప్రభుత్వం చేతకానితనం వల్లే గ్యాస్ కొరత గ్యాస్ ధర తగ్గించి వినియోగదారులకు వెంటనే అందజేయాలి

**- ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య(NFIW) అధ్యక్ష కార్యదర్శి డిమాండ్**




**కళ్యాణదుర్గం,మార్చి23.అక్షర టైమ్స్:** గ్యాస్ కొరత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చేతగాని తనం వల్లనే ఈ సమస్య ఏర్పడిందని,గ్యాస్ ధరలను తగ్గించి,వినియోగదారులు అందరికీ తక్షణం అందజేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ నియోజకవర్గ కార్యదర్శి కవిత,అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. గ్యాస్ కొరతపై ముందస్తు చర్యలు తీసుకోకుండా అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధం బూచిగా చూపి గ్యాస్ ధరలను పెంచడం సిగ్గుచేటు ఉన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలోని టి సర్కిల్ నందు ఖాళీ సిలిండర్ లు ఉంచి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 400 రూపాయలు ఉన్న గ్యాస్ ధర, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1000 కి పైగా పెంచడం దారుణం అన్నారు. వినియోగదారుల తో కోట్ల రూపాయలు కొల్లగొట్టడమే బిజెపి దేశభక్తి అన్నారు. సిలిండర్ బుక్ చేసి 20 రోజులైనా రాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. మరోవైపు గ్యాస్ డీలర్లు సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న రని వారు మండిపడ్డారు. బుక్ చేసిన తర్వాత సర్వీస్ ఛార్జీల పేరుతో అధిక మొత్తం వసూలు చేయడం దుర్మార్గం అన్నారు. అధికారులు గ్యాస్ సక్రమంగా అందిస్తున్నామని చెప్పే అబద్ధపు మాటలు మానుకోవాలని హితువ పలికారు. మోడీ పాలనలో మహిళలకు కట్టెల పొయ్యి దిక్కైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలు తగ్గించి వినియోగదారులకు తక్షణం అందజేయాలని, లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుమలత, హసీనా, గౌరీ, అనిత, రామాంజనమ్మ, మంగమ్మ, చంద్రకళ, ఈరక్క, కవిత, షమీం, రాధా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ వారి కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం : ఆర్డిఓ వసంత బాబు



**కళ్యాణదుర్గం,మార్చి23.అక్షర టైమ్స్:** కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఈ రోజు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ౹ా+ా (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి జీ వసంత బాబు గారు, డివిజనల్ స్థాయి అధికారులు మరియు కార్యాలయపు సిబ్బంది పాల్గొనడమైనది. కార్యక్రమం లో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారి వారు ప్రజా సమస్యలను త్వరితగతిన పూర్తి చేయవలసిందిగా డివిజన్ స్థాయి అధికారులకు మరియు మండల స్థాయి అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో బాధితులు నేరుగా ఆర్ డి ఐ వసంత బాబు కు వినతి పత్రాలు, సమస్యలు తెలిపారు, ఆయన అందరి సమస్యలు తీసుకొని ఆయా శాఖ ల వారికి సమస్యలు తెలిపి త్వరగా బాధితులను కార్యాల చుట్టూ తిరిగించుకోకండి త్వరగా వారి పనిలో చేసి పెట్టి పనులు పూర్తి చేయాలని తెలియజేశాడు

# భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ఆశయాలను కొనసాగిస్తాం

**- భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలి**

**- భగత్ సింగ్ జయంతి వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి**

**- ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు**



**అనంతపురం,మార్చి23.అక్షర టైమ్స్:** స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతిని స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనం నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్ ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అతి చిన్న వయసులో వారు దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలని కొనియాడారు, నాడు స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కొరకు అనేకమంది ప్రాణ త్యాగాలు చేసిన వారిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లని గుర్తు చేసుకున్నారు, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం వారి రాజకీయ స్వలాభం కోసం కులాలకు,మతాలకు మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు, యువత భవిష్యత్ తరాల కోసం నాడు స్వాతంత్రోద్యమంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయులు చరిత్ర కలిగిన దేశం మనదని అలాంటిది నేడు మన దేశంలోని ప్రభుత్వ సంస్థలను సైతం ప్రైవేట్ పరం చేస్తూ యువత యొక్క శ్రమను కార్పొరేట్ రంగాలకు ఊడిగం చేసేటువంటి కుట్రను బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం పన్నుతోందని అన్నారు, దేశానికి వెన్నెముక లాంటి రైతులను సైతం ఆందోళన బాట పట్టే విధంగా చేసిన ఘన చరిత్ర బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు, బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థులను, యువకులను చైతన్య పరిచి నిరంకుశ వైఖరితో నడుస్తున్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి వర్ధంతిలను అధికారికంగా జరపాలని అదేవిధంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమంతురాయుడు, కుల్లాయిస్వామి, జిల్లా నాయకులు ఆంజనేయులు, నరసింహయాదవ్, వెంకట నాయక్, మంజునాథ్, వంశీ, చందు, ఉమామహేశ్, మౌళి, ఆనంద్, ధనుంజయ, శ్రీనివాస, ధను, తేజ, లోకేష్, రాజేష్, సమీర్, సాయి, శ్యామ్, పవన్, రాజు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# దాహార్తి తీర్చే దాత సేవా సంకల్పానికి ప్రతీక గోపెన రాంప్రసాద్

**- చలివేంద్రమును ప్రారంభించిన ఎస్సై -- సేవా కార్యక్రమానికి విశేష స్పందన**

**నల్లచెరువు,మార్చి23.అక్షర టైమ్స్:** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు యువ నాయకుడు గోపెన రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రము ఆదర్శప్రాయంగా నిలిచింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రమును నల్లచెరువు ఎస్సై మక్బూల్ బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మండుతున్న ఎండల్లో ప్రయాణికులు, పాదచారులు ఎదుర్కొనే ఇబ్బందులను గుర్తించి చలివేంద్రము ఏర్పాటు చేయడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. ప్రజల పట్ల సేవాభావంతో ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.





**సేవే లక్ష్యం -- ప్రజలే కుటుంబం**

సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న గోపెన రాంప్రసాద్, తన సామాజిక బాధ్యతను కార్యరూపంలో చూపిస్తూ చలివేంద్రము ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత అవసరమని, యువత సామాజిక సేవ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

**సేవలో ముందుండే నాయకుడు**

గోపెన రాంప్రసాద్ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై స్పందిస్తూ, అవసరమైన చోట సహాయం అందించడంలో ముందుంటారని స్థానికులు పేర్కొన్నారు. వేసవి కాలంలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ చలివేంద్రమును ఏర్పాటు చేయడం ఆయన సేవా తపనకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎద్దుల ఆంజనప్ప, చంద్ర, మోహన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వర్ల భరత్ కుమార్, మందాల కరుణాకర్ నాయుడు, అల్లా బకాష్, రాళ్లపల్లి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో ఘనంగా పెయ్యదూడల ప్రదర్శన (కాల్ఫ్ ర్యాలీ)




**కళ్యాణదుర్గం,మార్చి23.అక్షర టైమ్స్:** కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు వార్డులో ఈనెల 24వ తేదీ మంగళవారం భారీ స్థాయిలో పెయ్యదూడల ప్రదర్శన (కాల్ఫ్ ర్యాలీ) నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (ఙాణాా), అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. టి. కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రదర్శన ప్రధాన లక్ష్యం కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన మేలుజాతి పెయ్యదూడల పెంపకం, పోషణపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించడం. కార్యక్రమ విశేషాలు - మేలుజాతి ప్రదర్శన అత్యుత్తమ జాతి పెయ్యదూడలను ప్రదర్శిస్తూ, వాటి సంరక్షణ మరియు యాజమాన్య పద్ధతులను నిపుణులు వివరించనున్నారు. ఆరోగ్య సేవలు పెయ్యదూడలకు నట్టల నివారణ మందుల పంపిణీతో పాటు, పశువైద్య నిపుణులచే ఆరోగ్య పరిరక్షణపై సూచనలు అందించబడతాయి. రైతులకు విజ్ఞప్తి కళ్యాణదుర్గం మరియు పరిసర ప్రాంతాల పశుపోషకులు తమ మేలుజాతి పెయ్యదూడలతో ఈ ప్రదర్శనలో పాల్గొని, నిపుణుల సూచనలు పొందాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు కోరారు. అత్యుత్తమ దూడలను పెంచిన రైతులకు ప్రోత్సాహకాలు కూడా అందజేయబడతాయి.

# తెదేపా కార్యకర్త మృతి

**నివాళాలు అర్పించిన కూటమి నాయకులు**

**- మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం**



**సోమందేపల్లి,మార్చి23.అక్షర టైమ్స్:** మండల కేంద్రములోని సాయినగర్ లో నివాసముంటున్న టీడీపీ కో కన్వీనర్ సుబ్బు తండ్రి వడ్డీ హనుమన్న(70) అనారోగ్యం తో మృతి చెందాడు. ఈ సందర్భంగా కూటమి నాయకులు కార్యకర్త మృతదేహానికి నివాళు లర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు 15,000 వేలు ఆర్థిక సాయం అందించారు. మంత్రి సవితమ్మ విజయవాడ నుండి కుటుంబ సభ్యులను ఫోన్ లో పరామర్శించి మృతుడి కుటుంబానికి టీడీపీ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని మనోధైర్యంతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డి.వి ఆంజనేయులు,టీడీపీ మండల కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్,పట్టణ అధ్యక్షులు వడ్డీ సూరి,మాజీ ఎంపీటీసీ మరియు సాయి నగర్ బూత్ కన్వీనర్ కిష్టప్ప,ఉప్పర బాబయ్యా, ఉపాధ్యక్షులు ఆకుల రమణ,జనసేన నాగరాజు,ఏ.బి ఆంజనేయులు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# "నల్లచెరువులో అంబేద్కర్ విగ్రహానికి శ్రీకారం ఘనంగా భూమి పూజ"

**"అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం -- టిడిపి కన్వీనర్ పి.రాజశేఖర్,బాబు**




**నల్లచెరువు,మార్చి23.అక్షర టైమ్స్:** నల్లచెరువు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీప మూడు రోడ్ల కూడలిలో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ స్థాపనకు భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా పూజలుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి కన్వీనర్ రాజశేఖర్ బాబు, మాజీ ఎంపీపీ తాటిచర్ల మాబుసాహెబ్ హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు శ్రీకారం చుట్టడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది.

**అన్ని విధాలా సహకారం -- పి.రాజశేఖర్ బాబు**

ఈ సందర్భంగా పి.రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నూతన విగ్రహ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధి, సామాజిక సమానత్వానికి అంబేద్కర్ ఆలోచనలు మార్గదర్శకమని పి. రాజశేఖర్ బాబు పేర్కొన్నారు. ఈ విగ్రహం ఏర్పాటు ద్వారా యువతకు ఆయన సిద్ధాంతాలపై అవగాహన పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు సర్పంచ్ పంచరత్నమ్మ నాగబయప్ప, పాటు తిరుపాల్, అంజనప్ప, రమణ, ఆంజనేయులు, ఈవి రమణ, రామాంజులు,ఎమ్ ఆర్ పి ఎస్ వర్ల భరత్ కుమార్,తిమ్మయ్య మరియు టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సింహ గర్జన సెగ - కలెక్టరేట్‌కు కదిలిన బీసీవై పార్టీ శ్రేణులు



**అనంతపురం,మార్చి23.అక్షర టైమ్స్:** భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) వ్యవస్థాపక అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ పిలుపు మేరకు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సింహ గర్జన వేదికగా పార్టీ ప్రతిపాదించిన 5 కీలక డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ప్రెస్ మీట్ కార్యక్రమంలో పాల్గొని ఈ 5 డిమాండ్ లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కానీ పక్షంలో అధ్యక్షులు రామచంద్ర యాదవ్ గారితో కలిసి ఏప్రిల్ 11వ తేదీన విజయవాడ నడి ఒడ్డున ఆమరణ దీక్ష కు సిద్ధం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం స్టేట్ కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్, స్టేట్ ఎగ్జిక్యూటీ మెంబర్ జిట్టా రామ్ మోహన్, స్టేట్ ఎగ్జిక్యూటీ మెంబర్ పవన్ కుమార్, సోషియల్ మీడియా యశ్వంత్, తాడిపత్రి నియోజకవర్గ కన్వీనర్ డాకరాజు,మహిళా విభాగం లక్ష్మీ, వాల్మీకి రామంజి, శివకుమార్, రమేష్, బాలరాజు, రాజశేఖర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వాదోపవాదాలమధ్య ఘర్షణవేలం పాటవాయిదా



**రాయదుర్గం,మార్చ్23.అక్షర టైమ్స్:** రాయదుర్గం పురపాలక సంఘం మార్కెట్ వేలం పాటలు సోమవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి కార్యాలయంలో నిర్వహించారు. 31 మంది వేలం పాటలో పాల్గొన్నారు. గతంలోవేలం పాటల సందర్భంగా ఘర్షణ జరగడంతో ఈసారి కూడా ఘర్షణ జరుగుతుందనే ఉద్దేశంతో ఇన్స్పెక్టర్ జయ నాయక్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు జంతువధశాలకు వేలం పాడటానికి ఎవరూ ముందుకు రాకపోగా వారపు సంత మార్కెట్ వేలం పాడేందుకు వేలం పాట జరుగుతుండగా పాటదారుల మధ్య మాట పెరగడంతో ఘర్షణ జరుగుతుందనే ఉద్దేశంతో కమిషనర్ వేలంపాటను 25వ తేదీకి బుధవారానికి వాయిదా వేశారు. టిడిపి, బిజెపి సానుభూతిపరులు వేలంపాటలో పాల్గొన్నారు. పాటదారుడు ఒకేసారి ఎక్కువ మొత్తం పాడటంతో ఇతరులు అభ్యంతరం చెప్పడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో వేలంపాటను కమిషనర్ వాయిదా వేశారు.

## భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్లు భారత స్వాతంత్ర్య సమరంలో అమర వీరులు : బాబు



**రాయదుర్గం,మార్చ్23.అక్షర టైమ్స్:** 1931 మార్చి 23న లాహోర్ సెంట్రల్ జైలులో వారిని బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసింది, భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా భారతదేశంలో అమరవీరుల దినోత్సవం గా పాటిస్తారు, ఆ భావజాలం తోనే ఆమ్ ఆద్మీ పార్టీ పురుడు పోసుకుంది, అతి తక్కువ కాలంలోనే జాతీయ పార్టీగా గుర్తింపు పొందిందని అన్నారు, విశాఖపట్నంలోని రెండు రోజుల ఆమ్ ఆద్మీ పార్టీ కార్యక్రమంలో భాగంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆప్ జిల్లా కన్వీనర్ బీ. వెంకటరమణ (బాబు) నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే పండరీనాథ్ నాగరాజు రెడ్డి మహమ్మద్ గౌస్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## పామిడిలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**పామిడి,మార్చి23.అక్షర టైమ్స్:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ నాయక్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రోకియాబేగం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక లయన్స్ క్లబ్ కమిటీసభ్యులు ప్రజల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్ తో చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కొత్త కుండలలో మంచి నీటి వలన నీరు చల్లగా ఉండంతో ఆరోగ్యం చేకూరుతుంది అన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శివకార్తీకరెడ్డి లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు,డాక్టర్ శివకార్తీక్ రెడ్డి,జిల్లా చైర్పర్సన్ డాక్టర్ మురళీకృష్ణలు మాట్లాడుతూ వడదెబ్బ,అతిసార వ్యాధులు రాకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా నివారణ చర్యలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండలఅధ్యక్షుడు రఘువీర్. ప్రధాన కార్యదర్శి పత్రశ్రీనివాసులు, కోశాధికారి డి షేక్షావలి, జిల్లా చైర్ పర్సన్స్ జయరాంరావు, డాక్టర్ మురళీకృష్ణ,డాక్టర్ శాంతి ప్రియ, ఉపకార్యదర్శి ముండే షేక్షావలి, డైరెక్టర్లు పత్రా నరేష్. పురుషోత్తం మధుగౌడ్, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, లక్ష్మీ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

- వాల్మీకి సంఘం అధ్యక్షుడు బండి



**గుమ్మఘట్ట,మార్చ్23.అక్షర టైమ్స్:** రాయదుర్గం నియోజకవర్గం ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు మరియువాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షు డు నాయకుల బండి క్రిష్టప్ప మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం గుమ్మగట్ట మండలం కే.పీ.దొడ్డి గ్రామంలో నూతనంగ ప్రతిష్టించిన మహర్షి వాల్మీకి విగ్రహం ఆవిష్కరణ లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ కుటుంబ సభ్యులు, ఆ మండల వాల్మీకి సామాజిక వర్గం సోదరులతో కలిసి కమిటీ ఆహ్వానం మేరకు ఆ సేవా సమితి సభ్యులతో కలిసి మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆ గ్రామ వాల్మీకి సంఘం కమిటీ సభ్యులు సెట్టెప్ప నాగరాజు ఇతర కమిటీ సభ్యుల పిలుపుమేరకు ఆయన మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా పూర్ణ హోమం, మహర్షి వాల్మీకి విగ్రహం కు పూజలు చేసే కార్యక్రమం కు ఎమ్మెల్యే కాలవతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ద్వారా భార్యాభర్తలు, అన్నదమ్ములు, సాటి మనుషుల మధ్య ఉండాల్సిన బంధాలు, బాంధవ్యాలు, ఆప్యాయతలు సమాజానికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. మహానుభావుడు మహర్షి వాల్మీకి మానవుడైనప్పటికీ దేవుడు గా కొలవబడుతున్నాడని, రామాయణం సంస్కృతికి, సాహిత్యానికి నిదర్శనమని, సమాజంలోని అన్ని సామాజిక వర్గాల వారికి ఆదర్శమని ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా తన రామాయణ రచనలో నాడు రాముడు పాలించిన రాజ్యపాలన, రాజనీతి లాంటి విధి విధానాలను సమాజానికి తెలియపరచిన మహోన్నతమైన వ్యక్తిని ఆయన తెలిపారు. ఈ విషయాలన్నీ సమాజానికి అందించిన మహర్షి వాల్మీకి కుల, మతాలకు అతీతంగా మానవులంతా సమానమని తెలిపారు.

## ఘనంగా పార్ధసారధి రెడ్డి జన్మదిన వేడుకల

తల్లిదండ్రులు, తమ్ముడు,ఆత్మీయుల నడుమ కేకు కట్టింగ్





**సోమందేపల్లి,మార్చ్23.అక్షర టైమ్స్:** ఆర్.కే.ఎఫ్.ఎం.ఎస్ అధినేత మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి తనయుడు, సీఈఓ పార్ధసారథి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి, సోమవారం మండల కేంద్రం లోని తన నివాసంలో తన తల్లిదండ్రులు,ఆర్ కే ఎఫ్ ఎమ్ ఎస్ ఉద్యోగులు, ఆత్మీయులు,సన్నిహితులు, విలేఖరుల నడుమ జన్మదిన వేడుకలు ఘనంగా జరుకున్నారు. తన తల్లిదండ్రులు తో కలిసి కేకు కట్ చేసి తన తల్లిదండ్రులకు తినిపించారు, అనంతరం ఆత్మీయుల నుండి శుభాకాంక్షలు అందుకున్నారు పార్ధసారథిరెడ్డి,ఈ సందర్భంగా అతిథులకు విందు ఏర్పాటు చేసారు,ఈ కార్యక్రమం లో తమ్ముడు యస్వంత్,ఆర్ కే ఎ ఫ్ ఎమ్ ఎస్ టీం, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దళారి మాటున జరుగుతున్న అక్రమ వసూళ్ల దందా పై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్

- సిపిఎం నాయకులు



**రాయదుర్గం,మార్చ్23.అక్షర టైమ్స్:** రాయదుర్గం ప్రాంతీయ మోటారు వాహనముల తనిఖీ అధికారి వారి కార్యాలయంలో దళారి మాటున యదేచ్ఛగా జరుగుతున్న అక్రమ వసుల దందాపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యు డుబి .మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి పత్రిక పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు, ఈ సమావేశంలో ఈయన మాట్లాడుతూ, ఈ కార్యాలయంలో పేరుకే ఆన్లైన్ అని మొత్తం అంతా ఆఫ్ లైన్ లోనే దళారి అక్రమ వసూల్లో పాల్పడుతూ మొత్తం ఆఫ్లైన్లోనే చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యాలయంలో ఏ పని జరగాలన్న దళారీని దళారి కుమారుడిని వాహనదారులు సంప్రదించి ముడుపులు ముట్టించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దళారి అచ్చం ప్రభుత్వ అధికారిలాగా దర్పం ప్రదర్శిస్తూ ఎల్ ఎల్ ఆర్ డి ఎల్ ల కోసం వచ్చిన వాహనదారులపై తను చెప్పిందే వేదంలాగా వాహనదారులకు హుకుం జారీ చేయడం దేనికి సంకేతము మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అదేవిధంగా పర్మిట్లు లేకుండా తిప్పుతున్న బస్సులు,ఇతర వాహనాలు, గూడ్స్ వెహికల్స్ నుంచి కూడా ఈ దళారి దళారి కుమారుడు నెలసరి మామూలు వసూలు చేయడంలో కీలక పాత్ర వహిస్తున్నారంటే ఇది అక్రమ వసుల దందా కాకపోతే మరి ఏమిటో జిల్లా స్థాయి అధికారులే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ దళారి దళారీ కుమారుడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాహనానికి డ్రైవర్గా విధులు నిర్వహిస్తూ ఈ రకంగా లైసెన్సుల కోసం వచ్చే ప్రజల నుండి వేల రూపాయలను అక్రమ వసూళ్ల దందా పేరుతో వసూలు చేయడానికి సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. అదేవిధంగా వాహనదారుల నుండి ఈ దళారి వసూలు చేస్తున్న అక్రమ దందాలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాటా ఎంత అని సిపిఎం పార్టీ సూటిగా ప్రశ్నిస్తోందని ఆగ్రహ వ్యక్తం. గత వారం రోజుల నుండి రోజు ఒక పత్రికలో రాయదుర్గం ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయంలో మామూలు దందాపై కథనాలు వెలబడుతున్న ఎందుకని జిల్లా స్థాయి అధికారులు ఇప్పటివరకు ఈ అక్రమ దందాపై విచారణ చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ దళారికి ఇస్తున్న జీతం ఎంత ప్రస్తుతం ఈ దళారి సంపాదన ఏ స్థాయిలో ఉందో జిల్లా అధికారులే విచారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి రాయదుర్గం మోటార్ వాహనముల తనిఖీ అధికారి వారి కార్యాలయంలో ఆఫ్లైన్ పేరుతో ఈ దళారి చేస్తున్న అక్రమ దందాపై తక్షణమే విచారణ చేపట్టాలని, వీరిపై మరియు వీరికి సహకరిస్తున్న అధికారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ శాఖలో జరుగుతున్న అక్రమ వసూళ్ల దందాకు వ్యతిరేకంగా ఆర్టిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మధు రమేష్ బాబు అశోక్ తిప్పే స్వామి అంజి ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది కానుకగా ఏపీ జాబ్ క్యాలెండర్ విడుదల ముదిగుబ్బలో కూటమి సంబరాలు

- 10,060 ఉద్యోగాల భర్తీకి ప్రణాళిక -- నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు

- ఉగాది కానుకగా ఏపీ జాబ్ క్యాలెండర్ విడుదల -- ముదిగుబ్బలో కూటమి నేతలకు పాలాభిషేకం





**ముదిగుబ్బ,మార్చి23.అక్షర టైమ్స్:** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించిన జాబ్ క్యాలెండర్‌ను ఘనంగా విడుదల చేసింది. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇది శుభవార్తగా నిలిచింది. ఈ క్యాలెండర్ ద్వారా మొత్తం 10,060 ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు ప్రకటించింది. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను దశలవారీగా భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ జాబ్ క్యాలెండర్‌ను రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యమని స్పష్టం చేశారు.జాబ్ క్యాలెండర్ ప్రకారం, ఏపీపీఎస్సీ గ్రూప్–1, గ్రూప్–2, పోలీస్, ఉన్నత విద్య, ఫారెస్ట్, ఇంజనీరింగ్, ఆరోగ్య శాఖలు సహా అనేక విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నారు. మొత్తం 41 రకాల నోటిఫికేషన్లు మే 15 నుంచి అక్టోబర్ 15 వరకు దశలవారీగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మే 15న ఉన్నత విద్యాశాఖలో 1,500 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుండగా, సెప్టెంబర్ 15న ఏపీపీఎస్సీ గ్రూప్–2 కింద 750 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.ఈ నియామకాల ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై నిరుద్యోగ యువతలో హర్షం వ్యక్తమవుతోంది. చాలా కాలంగా జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, జాబ్ క్యాలెండర్ విడుదలపై శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. ముదిగుబ్బలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన నాయకులు కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కేక్ కట్ చేసి, పటాకులు పేల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, బీజేపీ మండల కన్వీనర్ అంజన్ రెడ్డి, జనసేన మండల కన్వీనర్ జయచంద్ర,సీనియర్ నాయకులు మాలపాటి రామకృష్ణ, ఇందుకూరు ఓబిరెడ్డి, రెడ్డప్ప, అనిల్, టిడిపి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మనోహర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో జాబ్ క్యాలెండర్ విడుదలపై ఇచ్చిన హామీ అమలు కాలేదని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతలో ఆనందం వ్యక్తమవుతోందని తెలిపారు.కూటమి నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు నమ్మకం కల్పిస్తోందని చెప్పారు. ఈ జాబ్ క్యాలెండర్ యువత భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని, రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యం

- సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలి

- అడవి బ్రాహ్మణపల్లి తాండాలో "రైతన్నా మీకోసం" కార్యక్రమం -- అధికారుల సూచనలు





**ముదిగుబ్బ,మార్చి23.అక్షర టైమ్స్:-** ముదిగుబ్బ మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తాండాలో సోమవారం నిర్వహించిన "రైతన్నా మీకోసం" కార్యక్రమంలో రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి శకుంతల మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను రైతులు సమర్థంగా వినియోగించుకోవాలని, నూతన పద్ధతులు, యంత్రాలు, శాస్త్రీయ సాగు విధానాలను పాటించడం ద్వారా పంటల ఉత్పత్తి పెరుగుతుందని ఆమె వివరించారు. అలాగే ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని రైతులు ఆర్థికంగా బలపడాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రవీంద్ర మాట్లాడుతూ, సేంద్రీయ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు దీర్ఘకాలిక లాభాలను దృష్టిలో ఉంచుకుని సాగు పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, డిప్యూటీ ఎంపీడీఓ, ఏపీఎం హేమలత, ఏఈఓ మనోహర్, గ్రామ వ్యవసాయ సహాయకులు వేణుకతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. కార్యక్రమం రైతులకు ఉపయోగకరంగా సాగింది.

## భారత చరిత్రలో సరికొత్త రికార్డు ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు

- అత్యధిక కాలం సేవలందించిన నాయకుడిగా నిలిచిన ప్రధాని

- బీజేపీ నాయకుడు సోమల ప్రకాష్ నాయుడు ప్రశంసలు



**ముదిగుబ్బ,మార్చి23.అక్షర టైమ్స్:** భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక విశిష్ట ఘట్టంగా నిలిచే రికార్డును నమోదు చేసిన గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అధినేతగా 8,931 రోజులు పూర్తి చేసుకున్న ఆయన, పవన్ ఛాంలింగ్ 8,930 రోజుల రికార్డును అధిగమించి భారతదేశంలో అత్యధిక కాలం ప్రజలకు సేవలందించిన నాయకుడిగా చరిత్రలో నిలిచారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సత్యసాయి జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ, నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి దిశానిర్దేశం చేస్తోందని అన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి, దేశ అత్యున్నత పదవిని అధిరోహించడం ఆయన కృషి, పట్టుదల, నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. మోదీ రాజకీయ ప్రయాణం ఎంతో విశిష్టమైంది. గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 12 ఏళ్లకు పైగా సమర్థ పరిపాలన అందించి అభివృద్ధికి నాంది పలికారు. అనంతరం 2014, 2019, 2024లో వరుసగా మూడు సార్లు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి దేశ ప్రజల విశ్వాసాన్ని పొందారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశ అభివృద్ధి దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవినీతి రహిత పాలన, పారదర్శకత, "దేశమే ప్రథమం" అనే సిద్ధాంతంతో మోదీ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని సోమల ప్రకాష్ నాయుడు తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మౌలిక వసతులు, డిజిటల్ రంగాల్లో దేశం సాధించిన పురోగతి ఆయన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. అంతర్జాతీయ వేదికలపై కూడా నరేంద్ర మోదీ భారతదేశ ప్రతిష్టను మరింత పెంచారని కొనియాడారు. గ్లోబల్ సౌత్ దేశాలకు నాయకత్వం వహిస్తూ భారత సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలను ప్రపంచానికి చాటి చెబుతున్నారని పేర్కొన్నారు. దేశ సేవలో ఆయన చూపిన స్థిరత్వం, అంకితభావం, దూరదృష్టి భారత యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, రాబోయే కాలంలో కూడా దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## 24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన పోలీసులు



మహిళ అరెస్ట్ - బంగారం, వెండి, నగదు రికవరీ

**కొత్తచెరువు,మార్చి23.అక్షర టైమ్స్:** మండల కేంద్రమైన కొత్తచెరువులో ఈ నెల 21న జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లో ఛేదించారు. దుర్గా స్ట్రీట్‌లో నివసిస్తున్న జలప్ప గారి శ్రీనివాసులు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి తలుపుల తాళం తెరిచి లోపలికి ప్రవేశించిన దొంగలు, చీరల్లో దాచిన తాళాలను ఉపయోగించి బీరువా తెరిచి అందులో ఉన్న ఒక జత బంగారు చెవి రింగులు, రెండు బంగారు ఉంగరాలు, రెండు జతల వెండి కుంకుమ గిన్నెలు, రెండు జతల వెండి కాళ్ల పట్టీలు మరియు రూ.50 వేల నగదును అపహరించారు. దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాల విలువ దాదాపు లక్ష రూపాయల వరకు ఉండగా, నగదు కలిపి మొత్తం రూ.1.50 లక్షల మేర నష్టం జరిగినట్లు తెలిసింది.బాధితుడు అదే రోజు సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ మారుతి శంకర్ తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలతో విచారణ ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో సంఘటన స్థలంలో తనిఖీలు చేపట్టి ఆధారాలు సేకరించారు. ఫింగర్ ప్రింట్ ఆధారాలు, జాగిలాల మార్గదర్శకత్వం ఆధారంగా అనుమానితులపై దృష్టి సారించారు.బాధితుడు అదే రోజు సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ మారుతి శంకర్ తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాలతో విచారణ ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో సంఘటన స్థలంలో తనిఖీలు చేపట్టి ఆధారాలు సేకరించారు. ఫింగర్ ప్రింట్ ఆధారాలు, జాగిలాల మార్గదర్శకత్వం ఆధారంగా అనుమానితులపై దృష్టి సారించారు.సాంకేతిక ఆధారాలపై ఫిర్యాదుదారుడి ఇంటి పక్కనే నివసిస్తున్న పులేటిపల్లి మైమున్ బి (45)ను పోలీసులు అనుమానితురాలిగా గుర్తించారు. అనంతరం ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె వద్ద నుంచి దొంగిలించిన బంగారం, వెండి ఆభరణాలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.కేసు నమోదైన 24 గంటల్లోనే దొంగను పట్టుకుని, అపహరించిన సొత్తును పూర్తిగా రికవరీ చేయడం పట్ల బాధితుడు శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు. పోలీసుల వేగవంతమైన చర్యలను స్థానికులు ప్రశంసించారు. గ్రామంలో భద్రతపై ప్రజల్లో నమ్మకం పెంచేలా పోలీసులు సమర్థంగా పనిచేశారని అభిప్రాయపడ్డారు.

# ఘనం.. షమీ వనం

జయమునిచ్చే జమ్మి



జమ్మిచెట్టుని 'శమీ వృక్షం' అని కూడా పిలుస్తారు. వైష్ణవ సంప్రదాయాలలో దీనిని 'ఆరణి' అని అంటారు. మహాభారతంలోని విరాట పర్వంలో పాండవులు జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను భద్రపరుస్తారు. అజ్ఞాతవాసం పూర్తయిన తర్వాత విజయ దశమినాడు ఆ అస్త్రశస్త్రాలకు పూజలు చేసిన తర్వాత ధరిస్తారు. అందుకే దసరా పండుగ నాడు ఆయుధ పూజ, శమీ పూజ సంప్రదాయాలను హిందువులు పాటిస్తున్నారు. జమ్మిచెట్టు జయాన్ని ఇస్తుందని నమ్ముతారు. హిందువుల ఇళ్లలో ఉదయం ఆయుధ పూజ, సాయంత్రం జమ్మి పూజ చేస్తారు. జమ్మి చెట్టుకు ప్రదక్షిణ, పూజలు చేసిన తర్వాత ఆ చెట్టు ఆకుల్ని పెద్దలకు ఇచ్చి ఆశీర్వచనం పొందుతారు. ఈ ఆకుల్ని 'బంగారం' అంటూ పది మందికి పంచిపెడతారు. జమ్మి చెట్టుని 'నవ గ్రహాల వృక్షం'గా పరిగణించేప్పుడు మాత్రం శనీశ్వరునికి ప్రతీకగా భావిస్తారు. వినాయకుని పూజలో ఈ జమ్మి ఆకు కూడా ఉంటుంది.

**'శమీ శమయతే పాపం..**
**శమీ శత్రు వినాశనీ**
**అర్జునస్య ధనుర్ధారీ..**
**రామస్య ప్రియదర్శినీ'**
**అన్న శ్లోకాన్ని చెట్టు చుట్టూ తిరుగుతూ చదివి నమస్కారం చేసుకుంటారు.**

జమ్మి పూలు మొగ్గ దశలో పసుపు రంగులో ఉంటాయి. విరబూసే సమయానికి గులాబీ రంగులోకి మారతాయి. ఈ పువ్వు సన్నగా, పొడవుగా, త్రిభుజాకారంలో ఉంటుంది. జమ్మి అత్యల్ప వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో కూడా పెరుగుతుంది. ఈ చెట్టు వేళ్లు భూమి లోపలికి చొచ్చుకొని, నీటిని గ్రహిస్తాయి. ఈ చెట్టు మధ్యస్థంగా పెరుగుతుంది. జమ్మి ఆకులు చింత ఆకుల్లా కనిపిస్తాయి. కానీ, పరిమాణంలో అంతకన్నా చిన్నగా ఉంటాయి. జమ్మి చెట్టు ఇంట్లో నాటుకుంటే ఇల్లు ప్రశాంతంగా ఉంటుందని నమ్మకం. కొమ్మను అంటుకట్టి, విత్తనాలనునాటి ఈ చెట్లు పెంచుకోవచ్చు. జమ్మిచెట్టు జయాలను ఇచ్చేదే కాకుండా సర్వరోగ నివారణి కూడా. ఆయుర్వేద ఔషధాల తయారీలో జమ్మి ఆకు, పూలు, విత్తనాలు, బెరడు ఉపయోగపడతాయి. విరేచనాలను కట్టడి చేయడానికి ఈ ఆకులను మజ్జిగతో కలిపి తీసుకుంటారు. జమ్మి కాయల్లో అనేక పోషకాలుంటాయి. జమ్మి కాయలతో కూరలు కూడా వండుకుంటారు. ఎడారి ప్రాంత వాసులు జమ్మి కాయలు ఎండబెట్టి, వరుగులు చేసుకొని సంవత్సరమంతా వంటల్లో వాడుకుంటారు.

# రైతాంగం ఆగమాగం



ఏడాదిలో ఎంత మార్పు? సమైక్య పాలకులు దండుగన్న వ్యవసాయాన్ని కేసీఆర్ పదేండ్లలో పండుగలా మారిస్తే కాంగ్రెస్ సర్కారు కేవలం 12 నెలల్లోనే అంతా తారుమారు చేసింది. కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన రైతుబంధు పెట్టుబడి సాయాన్ని చిందరవందర చేసింది. అసాధ్యమైన అర్హతలను సాకుగా చూపి లబ్ధిదారులను సగానికిపైగా తగ్గించబోతున్న సంగతి తెలిసిందే. గడిచిన వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి అన్నదాతలకు అందించాల్సిన రూ.26 వేల కోట్ల పంట పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. రైతుకూలీలకు సైతం అందిస్తామని చెప్పిన సాయం ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఇది ఒక పార్శ్వం మాత్రమే. ప్రభుత్వం మీద ఆశలుడిగిపోయి రైతు సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని కిందామీదా పడి సాగుచేసి పంటదీస్తే దాన్ని కొనుగోలు చేసే నాథుడే కరువయ్యాడు. వానకాలం సీజన్‌లో 1.56 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తే అందులో సర్కారు ఇప్పటివరకు కొన్నది 47 లక్షల టన్నులు మాత్రమే. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామనే హామీ బోగస్‌గా మారింది. 50 లక్షల టన్నుల సన్నాల సేకరణ ప్రభుత్వ లక్ష్యం కాగా కొనుగోలు చేసింది 18.78 లక్షల టన్నులు మాత్రమే. తద్వారా తగ్గిన కొనుగోళ్ల వల్ల రైతులకు రూ.1,561 కోట్ల కోత ఏర్పడింది. ఆ కాస్త కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లించాల్సిన మొత్తంలో బకాయిలు పెట్టడం విడ్డూరం. అటు పంట పెట్టుబడి సాయంలో కోత, ఇటు ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చూపుతూ, ఆలస్యం చేస్తూ రైతులను సర్కారు తీవ్ర వేదనకు గురిచేస్తున్నది. ఇక రైతు రుణమాఫీ అనేది పెద్ద ప్రహసనంలా మారింది. రూ.2 లక్షల పైచిలుకు రుణాల మాట దేవుడెరుగు, అంతకు లోపు ఉన్న రుణాలను ఆగం పట్టించి, అంతంతమాత్రంగా అమలు చేసింది. తూతూమంత్రం రుణమాఫీతో సరిపెట్టి చేతులు దులిపేసుకుంది. గంపెడాశతో ఎదురుచూసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. భూ యాజమాన్య హక్కులకు రక్షణ కల్పించి, బదిలీని సులభతరం చేసిన ధరణి వ్యవస్థను ధ్వంసం చేసింది. మరింత మెరుగైన వ్యవస్థ తెస్తానని చెప్పి మసిపూసి మారేడుకాయ చేసింది. అంతరించిపోయిన భూ తగాదాలకు తన అనాలోచిత నిర్ణయంతో మరోసారి తెరతీసింది. ప్రాజెక్టులను పడావుపెట్టి సాగునీటి సరఫరాను అస్తవ్యస్తం చేసింది. ఇది రైతులను ఆందోళనకు గురిచేసే అంశమే. మరోవైపు కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ పరిశ్రమల పేరుతో భూములు లాక్కొని ఆగమాగం చేస్తున్నది. ఇలా రైతుకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ సర్కారు వైఫల్యం, వారి పట్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. దీని ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. చరిత్రలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని బీరాలు పలికే సర్కారు.. పుస్తకాల్లో పేజీలు చింపేసి తృప్తి పడుతున్నది. రైతు సమస్యల పరిష్కారంపై ఆ మాత్రం శ్రద్ధ పెడితే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుంది.

## సోమందేపల్లి ఉర్దూ పాఠశాల వద్ద నూతన బోర్

- తీరనున్న దాహార్తి - మాట నెరవేర్చుకున్న మంత్రి సవిత





**సోమందేపల్లి,మార్చ్23.అక్షర టైమ్స్:** ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారు మంత్రి సవిత, ఇందులో భాగంగా సోమవారం సోమందేపల్లి లోని ఉర్దూ పాఠశాల ముందు నూతన బోర్ కి పూజలు చేశారు కూటమి నేతలు, కన్వీనర్ నడింపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, హిందూపురం పార్లమెంట్ తెదేపా కార్యదర్శి నీరుగంటి చంద్ర, పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి సమక్షంలో త్రాగు నీరు కోసం నూతన బోర్ కి పూజలు చేసారు, ముందుగా బంగారు షాపు షాషా పాయింట్ పెట్టగా, గ్రామ పెద్దలు గంగమ్మ కోసం పూజలు చేసారు,ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో భాగంగా మంత్రి సవిత గ్రామం లోని ఉర్దూ పాఠశాల మరియు డి ఎల్ రోడ్డులోని ప్రజలకు దాహార్తి తీర్చడానికి ఈ నూతన బోర్ ని మంత్రి వేయిస్తున్నారని, మంత్రి ఆదేశాలతో కూటమి నేతలు దగ్గర ఉండి బోర్ లారీ కి పూజలు చేసి, గంగమ్మ తల్లి కోసం పూజలు చేశామన్నారు, ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు నేతలు, అనంతరం బోర్ వెల్ అనిల్ బోర్ పనులు ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# అమ్మకు అండ బిడ్డకు భరోసా

## ప్రసూతి సెలవులు మీ హక్కు



అమ్మ కావడం ఆడవాళ్లకు ఓ వరం. ఆ వరం అందుకునేవేళ ఆనందంగా, ఆరోగ్యంగా, సౌకర్యంగా బతకాలని అందరూ కోరుకుంటారు. చట్టం కూడా దాన్నే ఆదేశిస్తుంది. పనిచేసే మహిళలకు మాతృత్వపు ఆనందం, ఆరోగ్యం దూరం కాకుండా ఉండేందుకు ప్రసూతి ప్రయోజన చట్టం చేసింది. తల్లి కాబోయే మహిళకు ప్రభుత్వ విభాగాలు, కంపెనీలు సెలవులు, వేతనం, ఇతర సదుపాయాలు కల్పించేలా రక్షణలు ఏర్పాటుచేసింది. ఉద్యోగం పోతుందనే భయం లేకుండా, పుట్టే బిడ్డతో సంతోషంగా గడపమని చెబుతున్నది. ప్రసూతి సదుపాయాల చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ప్రముఖ న్యాయ సహాయకురాలు జి. జ్యోతి రావు తెలియజేసిన వివరాలు 'జిందగీ' పాఠకుల కోసం..

**ప్రసూతి సెలవులు ఎప్పుడు తీసుకోవచ్చు?**

గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత సెలవులు తీసుకోవచ్చు. గర్భ విచ్ఛిత్తి అయినా, కాబోయే తల్లి ఆరోగ్యం, పుట్టబోయే బిడ్డకు ఇబ్బందులున్నా డాక్టర్ల సలహా మేరకు గర్భం తీయాల్సి వస్తే.. ప్రసూతి ప్రయోజన చట్టం ప్రకారం సెలవులు పొందవచ్చు.

**ప్రసూతి సెలవులు ప్రైవేటు కంపెనీల్లోని ఉద్యోగులకు వర్తిస్తాయా?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పదిమంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు/ కార్మికులు పనిచేసే ప్రైవేటు సంస్థలు, కర్మాగారాలు, గనులు, దుకాణాలకు ప్రసూతి ప్రయోజన చట్టం వర్తిస్తుంది. ఈ సంస్థల్లోని ఉద్యోగులు, కార్మికులు ప్రసూతి సెలవులు పొందడానికి అర్హులు.

**పెళ్లికాని వాళ్లు ప్రసూతి సెలవులు తీసుకోవచ్చా?**

ప్రసూతి ప్రయోజన చట్టం ద్వారా సెలవులు, వేతనం, సదుపాయాలు పొందడానికి వివాహం, వైధవ్యంతో సంబంధం లేదు. గర్భధారణ అయినట్లుగా వైద్యులు ధ్రువీకరిస్తే చాలు.

**ఈ సెలవులు గరిష్ఠంగా ఎన్ని రోజులు తీసుకోవచ్చు?**

అందరి ఆరోగ్య స్థితి ఒకేలా ఉండదు. అలాగే అందరి ఇళ్లలో ఒకే విధమైన పరిస్థితులు ఉండవు. తల్లి, అత్త సహకారం ఉన్న మహిళలు బిడ్డల ఆలనాపాలనా ఇంట్లో పెద్దవాళ్లకు అప్పగించి ఆఫీస్‌కి వెళ్తుంటారు. కానీ, అందరికీ ఇలాంటి పరిస్థితులు ఉండవు. మరికొంతమంది ప్రసూతి సమయంలో ఆపరేషన్ జరగడం, అనారోగ్యం బారినపడటం వల్ల త్వరగా కోలుకోరు. కాబట్టి ప్రసూతి సెలువులు ముగిసినా విధులకు హాజరయ్యే పరిస్థితి ఉండదు. ఇలాంటి ఆరోగ్య, సామాజిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రసూతి సెలవులు పొడిగించుకునేలా చట్టం వెసులుబాటు కల్పించింది.

**ప్రసూతి సెలవుల్లో వేతనం ఎంత ఇస్తారు?**

ప్రసూతి సెలవులన్నీ వేతన సెలవులే. ప్రతి సంస్థ తమ ఉద్యోగినులకు మెడికల్ ఖర్చులు, బోనస్, పిల్లలకు పాలు ఇవ్వడానికి సదుపాయాలు కల్పించాలని ప్రసూతి ప్రయోజన చట్టం నిర్దేశిస్తున్నది. ప్రసూతి ప్రయోజనాల చట్టం స్త్రీలు ఉద్యోగాలు చేయడాన్ని ప్రోత్సహించడమే కాకుండా మాతా శిశు సంక్షేమానికి వసతులు కల్పిస్తుంది. జీతభత్యాలు, ఇంటి అద్దె, వైద్య ఖర్చులకు కోత పెట్టే హక్కు ప్రభుత్వానికి గానీ, ప్రైవేట్ సంస్థలకు గానీ లేదు. కానీ, కార్యాలయానికి హాజరయ్యేందుకు ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ లాంటి భత్యాల్లో కోత విధించవచ్చు.

**తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటే ముందే ఆఫీసుకు పోవచ్చా?**

ప్రసూతి సెలవులకు గరిష్ఠ పరిమితి ఉంది. కనిష్ఠ పరిమితి అంటూ ఏమీ లేదు. ఆరోగ్యంగా ఉండి, పని చేయగలిగితే కాన్పు అయ్యే రోజు వరకు విధులకు హాజరు కావొచ్చు. ఆ తర్వాత ప్రసూతి సెలవులు తీసుకోవచ్చు. గరిష్ఠంగా సెలవులు వాడుకోదల్చుకోని వాళ్లు, ఆరోగ్యం బాగున్నవాళ్లు ప్రసూతి తర్వాత 18 వారాలు పూర్తికాక ముందే విధులకు హాజరుకావొచ్చు. ప్రసవానికి ముందు ఎనిమిది వారాలే సెలవు తీసుకోవాలనే నిబంధన ఏమీ లేదు. వైద్యులు విశ్రాంతి అవసరమని సూచిస్తే ఎనిమిది వారాల కన్నా ముందు నుంచే సెలవులు తీసుకోవచ్చు.

**సెలవులు పొడిగించుకోవచ్చా?**

ప్రసూతి సెలవులు గరిష్ఠంగా 26 వారాలూ ఉపయోగించుకున్న తర్వాత అవసరాన్ని బట్టి మళ్లీ పొడిగించుకోవచ్చు. కొంతమంది ప్రసవ సమయంలో అరుదైన అనారోగ్య సమస్యలకు గురవుతారు. వాటికి చికిత్స, విశ్రాంతి ఎక్కువ అవసరం. బిడ్డకు కానీ, తల్లికి కానీ అలాంటి ఆరోగ్య సమస్యలు ఉంటే ఈ చట్టం ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించదు. కానీ, ఆర్జిత సెలవులతో లేదా వేతనం లేని సెలవులతో ప్రసూతి సెలవులను మరో 26 వారాలు పొడిగించుకోవచ్చు. గరిష్ఠంగా 52 వారాల వరకు ఈ చట్టం ద్వారా సెలవులు పొందవచ్చు.

**సెలవులు, వేతనం ఇవ్వకపోతే ఏం చేయాలి?**

ప్రసూతి సెలవులు, వేతనం వర్తించకుండా ఏదైనా సంస్థ ఉద్యోగులతో నియామక సందర్భంలో ఒప్పందం చేసుకుంటే చట్టరీత్యా నేరం. ఇలాంటి నిబంధనలతో నియామక పత్రాలు ఇస్తే వాటిని తిరస్కరించాలి. సంతకం చేయకూడదు. ఆ ఒప్పంద ప్రతిపాదన పట్ల అసమ్మతి తెలియజేస్తూ యాజమాన్యానికి ఉత్తరం రాయాలి. కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. లేబర్ కమిషనర్‌ని లేదా కోర్టుని ఆశ్రయించాలి. కొన్ని ప్రైవేటు సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఈ నిబంధనలు సంపూర్ణంగా పాటించడం లేదు. ఇలాంటి సంస్థలు ప్రసూతి సెలవులు నిరాకరించినప్పుడు ప్రభుత్వ సంస్థ అయితే పై అధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రైవేటు సంస్థలు అయితే కార్మిక శాఖకు కంప్లయింట్ చేయొచ్చు. అక్కడ న్యాయం జరగకపోతే కోర్టుని ఆశ్రయించవచ్చు.

**ప్రసూతి సెలవుల చట్టం 1961**


పనిచేసే మహిళలకు మానవీయ వసతులు కల్పించాలని, న్యాయపరమైన నిబంధనలు ఉండాలని, ప్రసవ సమయంలో పని నుంచి వెసులుబాటు కల్పించాలని, ప్రభుత్వం ఇతర ప్రయోజనాలు కల్పించాలని భారత రాజ్యాంగం, ఆర్టికల్ 42 స్పష్టం చేస్తున్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1952లో తన 103వ సమావేశంలో ప్రసూతి రక్షణ కల్పించాలని నిర్ణయించింది. దానికి లోబడి భారత ప్రభుత్వం 1961లో ప్రసూతి ప్రయోజన చట్టం తెచ్చింది. 2016లో ఈ చట్టంలో కొన్ని సవరణలు చేసింది.

# బకెట్ హ్యాట్సాఫ్










సమ్మర్ వచ్చిందంటే ఇంట్లో టోపీ ఎక్కడ పెట్టామో వెతుకుతాం. దొరక్కపోతే కొత్తది ఆర్డర్ పెట్టేస్తాం. వేసవి అవ్వగానే మళ్లీ టోపీ ఊసే ఉండదు. మరి, వింటర్ సంగతేంటి? చలి తగలకుండా వెచ్చగా ఉండాలంటే? టోపీలు ఏం లేవా? అంటే.. ఎందుకు లేవు? మంకీ క్యాప్‌లు ఉన్నాయిగా అంటారేమో!! అవి కావండోయ్%ా% ఇప్పుడు మనం మాట్లాడుకునే టోపీలు ఇప్పటివి కాదు.. జమానా నుంచి వాడుకలో ఉన్నవి. ఏ కాలంలోనైనా హాయిగా వాడదగ్గవి. అవే 'బకెట్ హ్యాట్'లు. ఎవర్ గ్రీన్ ట్రెండ్‌గా నేటి తరాన్ని ఆకట్టుకుంటున్న ఈ బకెట్ హ్యాట్‌లకు సంబంధించిన ఫ్యాషన్ విశేషాలే ఇవి. బకెట్ హ్యాట్ అనే పేరు దాని ఆకారం నుంచి వచ్చిందే! ఇది ఒక బకెట్‌లా గుండ్రంగా ఉంటుంది. తలను అన్ని వైపుల నుంచి కప్పి ఉంచుతుంది. ముత్తాతల నాడు పాశ్చాత్య దేశాల్లో మత్స్యకారులు, రైతులు ఈ టోపీని ధరించేవారు. కాలక్రమంలో ఈ టోపీలు ఫ్యాషన్ రంగంలోకి ప్రవేశించాయి. తర్వాత రకరకాల మెటీరియల్స్‌తో తయారై, కొంగొత్త రంగులు పులుముకున్నాయి. నయా డిజైన్లు సంతరించుకొని ఫ్యాషన్ ప్రియులకు దగ్గరయ్యాయి. 19వ శతాబ్దం చివర్లో ఐర్లాండ్‌లోని మత్స్యకారులు ఎండ, వర్షం నుంచి కాపాడుకోవడానికి ఒక ప్రత్యేకమైన రకం టోపీని ధరించేవారు. ఆ టోపీలే ప్రపంచవ్యాప్తంగా ఒక ఫ్యాషన్ ఐకాన్‌గా మారాయి. 1950 ప్రాంతంలో యూరప్ యువత ఆధునిక జీవన సంస్కృతి వైపు అడుగులు వేసింది. ఆ సమయంలో అక్కడ 'మోడ్' ఉద్యమం పురుడుపోసుకుంది. యువతను ఆకర్షించడానికి రాక్ బ్యాండ్స్ నిర్వహించేవారు. ఈ హిప్-హాప్ సంస్కృతిలో బకెట్ హ్యాట్‌కూ ప్రత్యేక స్థానం ఉంది. ర్యాపర్లు, స్ట్రీట్‌వేర్ ప్రేమికులు బకెట్ హ్యాట్‌కు తమ ట్కస్టైల్‌కు అనుగుణంగా ధరించేవారు. అలా బకెట్ హ్యాట్‌కు ఎనలేని ప్రాధాన్యం వచ్చింది. ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారింది.

**ఫ్యాషన్ మాత్రమే కాదు..**

బకెట్ హ్యాట్ ఫ్యాషన్ మాత్రమే కాదు! ఇది వేసవిలో ఎండ నుంచి కాపాడుతుంది. అలాగే, చలికాలంలో తలను మొత్తం కప్పేసి వెచ్చగా ఉంచుతుంది. అంతేకాదు.. వాటర్ ప్రూఫ్ మెటీరియల్స్‌తో తయారైన బకెట్ హ్యాట్‌లు వానాకాలం ఇబ్బడిముబ్బడిగా అమ్ముడవుతాయి. ఇది బడ్జెట్‌లో దొరుకుతుంది. ఎలాంటి మెటీరియల్‌తో అయినా దీనిని రూపొందించొచ్చు. ట్రెండీగా కనిపించడానికి అదనపు అలంకరణలూ చేయొచ్చు. క్యాజువల్ కాలేజీ డ్రెస్‌లకూ, ఫ్యాషన్ వస్త్రశ్రేణిపైకి కూడా ఇది నప్పుతుంది. ఫార్మల్, ఇన్‌ఫార్మల్.. లుక్ ఏదైనా ఈ బకెట్ హ్యాట్ ట్కస్టైల్‌గా సెట్ అయిపోతుంది. ఓవర్ సైజ్డ్ డ్రెస్‌లకు ఇది చక్కని ఆప్షన్. నేటి తరం యువతీ యువకులు మరో అడుగు ముందుకేసి పర్యావరణహితంగా 'ప్లాంట్స్ ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్స్'తో తయారుచేసిన బకెట్ హ్యాట్స్‌ని వాడుతున్నారు. ఆర్గానిక్ కాటన్‌తో తయారుచేసిన వాటికి, రీసైకిల్ పాలిస్టర్ మెటీరియల్స్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతేకాదు.. తమ అభిరుచికి తగ్గట్టుగా బకెట్‌హ్యాట్‌కి అదనపు సొగసులు అద్ది 'హ్యాట్సాఫ్' అనిపించుకుంటున్నారు!

# బంధులన్నీ బంద్



ఉమ్మడి పాలనలో గోస పడ్డ ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారు కేసీఆర్. అంతేకాదు, సబ్బండ వర్గాలకు ఫలాలను అందించేందుకు 'బంధు' పేరిట పలు పథకాలను ప్రారంభించారు. సాగును బాగు చేసేందుకు 'రైతుబంధు'వై ఎకరాకు ఏటా రూ.10 వేలు అందించారు. చనిపోయిన అన్నదాతల కుటుంబాలకు 'రైతుబీమా' ద్వారా రూ.5 లక్షలు సాయం చేశారు. 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇచ్చి కర్షకులకు ఆదెరువయ్యారు. సమాజంలో అత్యంత పీడనకు గురైన సమాజాన్ని ఆదుకునేందుకు 'దళిత బంధు' పేరిట ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి వారిని వ్యాపారులను చేశారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం బీసీ బంధు ద్వారా ఆర్థిక సాయం చేశారు. గొల్ల, కురుమ సోదరులకు 'గొర్రెల పంపిణీ', మైనార్టీ సోదరులకు 'మైనార్టీ బంధు' ఇచ్చారు. గర్భిణులకు కేసీఆర్ కిట్‌తో పాటు రూ.11 వేలు సాయం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ ఇచ్చి వారికి బంధువయ్యారు.కానీ, మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో బంధులన్నీ బంద్ అయిపోయాయి. మాటల గారడీతో అధికారం చేజిక్కించుకున్న హస్తం పార్టీకి పైరవీల కోసం ఢిల్లీకి పోవ డం, కూల్చివేతలు, అక్రమ కేసులు తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదు. ఈ నేపథ్యంలో తన పథకాల రూపంలో ప్రజల మనసుల్లో ప్రజా బంధువు గా మారిన కేసీఆరే మళ్లీ రావాలని అందరూ కోరుకుంటున్నారు.